అల్లర్లు సృష్టిస్తే.. ఉక్కుపాదం



- 100 సీసీ కెమెరాలతో నిఘా
- విధుల్లో 600 మంది సిబ్బంది:

ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి

అమీర్‌పేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జూలై 1న జరుగనున్న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం, 2న జరిగే రథోత్సవ కార్యక్రమంలో అల్లర్లు సృష్టించాలనే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి హెచ్చరించారు. ఈ కల్యాణ మహోత్సవంలో అడుగడుగునా పోలీసుల తనిఖీలు ఉంటాయని, కత్తులు, బ్లేడ్లు లాంటి మారణాయుధాలతో సంచరించేవారిపై గట్టి నిఘా కోసం 100 సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామన్నారు. దీంతో పాటు 600 మంది పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని వెల్లడించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. జూలై 1న జరిగే ఎల్లమ్మ కల్యాణం రోజున లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. గత సంవత్సరం వీవీఐపీలు, డోనర్లకు బల్కంపేట పెట్రోల్ పంపు వైపు 60 ఫీట్ల రోడ్డు నుంచి ప్రవేశం కల్పించాం. అక్కడ నుంచే సాధరణ భక్తులకు కూడా క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. వీవీఐపీ, డోనర్ల లైన్లలోకి అందరూ ప్రవేశించడంతో ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఈ సంవత్సరం 'వీవీఐపీ, డోనర్లు, దేవాలయ సిబ్బంది కోసం ఏర్పాటు చేసే క్యూలైన్ల సమీపంలోకి ఇతరులు ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటున్నా. సాధారణ భక్తుల క్యూలైన్లను మరికొంత దూరం పొడగించి, బేగంపేటకు వెళ్లే మార్గం వరకు బారీకేడ్లు ఏర్పాటు చేస్తాం. కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యే శివసత్తుల దర్శనానికి ప్రత్యేక సమయం కేటాయించనున్నాం' అని తెలిపారు.

భక్తుల భద్రత కోసం భారీ బందోబస్తు

భక్తులు, ప్రముఖులు పెద్దసంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో ప్రత్యేక సిబ్బందిని వీధుల్లోకి తీసుకుంటున్నామని, ముఖ్యంగా అన్ని ప్రాంతలను పరిశీలించేలా 100కు పైగా సీసీకెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి చెప్పారు. ఈ కెమెరాల ద్వారా రద్దీతోపాటు కల్యాణోత్సవాన్ని పర్యవేక్షించేలా ఎల్లమ్మ ఆలయం ముందు కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరో మూడుచోట్ల ప్రత్యేక కంట్రోల్‌రూంలను ఏర్పాటుచేస్తున్నామని, కల్యాణోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలను అమల్లోకి వస్తాయని తెలిపారు. సుమారు 600 మంది పోలీసులను భద్రత కోసం నియామించేలా ఏర్పాట్లుచేశామన్నారు. ఇందులో 10 ప్లాటూన్ల సాయుధ బలగాల సిబ్బంది, ఏసీపీలు, 16 మందికి పైగా ఇన్‌స్పెక్టర్లు, 60 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లతో పాటు 300 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ప్రత్యేకంగా 50 మంది వరకు మహిళా కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తారని అన్నారు. వీరికి అదనంగా హోంగార్డులను భద్రతా విధుల్లోకి తీసుకుంటున్నామని తెలిపారు.

అసాంఘిక శక్తులపై మఫ్టీ పోలీసులు నిఘా...

ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని అసాంఘిక శక్తులు, జేబు, గొలుసు దొంగలు వచ్చే అవకాశం ఉంది. ఇందుకు మఫ్టీలో పోలీసులను నియమించి, వారి పర్యవేక్షణలో నిఘాను విస్తృతం చేస్తామని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. దీనికి తోడు నగర టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ పోలీసులు, ఏఆర్ దళాల భద్రత అదనంగా ఉంటుంది. డబ్బులు, నగలు పోగొట్టుకున్నా, చోరీకి గురైనా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలలో ఫిర్యాదులు స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నాం అన్నారు. వెంటనే గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నామని చెప్పారు. మద్యం తాగి ఘర్షణలకు పాల్పడే అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలపై నిఘా పెంచుతామని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి చెప్పారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయం ముస్తాబు

నేడు ఎదుర్కోళ్లు
జూలై 1న అమ్మవారి కల్యాణం
2న రథోత్సవం





అమ్మవారి మూల విరాట్



మెర్క్యూరీ లైట్లతో ముస్తాబైన ఆలయ రాజగోపురం

అమీర్‌పేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ ప్రాంతం ఒకప్పుడు పచ్చని పైరుతో అలరారిన పంటపొలం. నేడు వేలాది మంది భక్తులు తరలివచ్చే ఆధ్యాత్మిక నిలయం. గతంలో మూడు రోజుల జాతర.. నేడు నిత్యయాత్రగా మారింది. స్వయంభుగా వెలసిన ఎల్లమ్మ తల్లి ఏళ్లుగా పూజలందుకుంటున్న ఈ ఆలయానికి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎల్లమ్మతల్లి కొలిచిన వారికి కొంగుబంగారమని భక్తులు నమ్ముతారు. ఏటా ఆషాఢమాసం మొదటి మంగళవారం శివసత్తులు అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించేవారు. ఇదే సాంప్రదాయాన్ని దేవాదాయ శాఖ కొనసాగిస్తోందని ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌గౌడ్ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 30 నుంచి జూలై 2 వరకు మూడు రోజుల పాటు కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవాస్థానం అన్ని ఏర్పాట్లను చేస్తోంది. 30న ఎదుర్కోళ్లు, 1న కల్యాణం, 2న రథోత్సవం ఉంటాయి. కల్యాణానికి భారీగా తరలొచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లూ చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇప్పటికే అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు.

బావిలో వెలసిన తల్లి..

బల్కంపేట ఒకప్పుడు కుగ్రామం. చుట్టూ పంటపొలాలు ఉండేవి. సేద్యం నీటి కోసం బావులను తవ్వించారు. ఈ క్రమంలో స్థానిక రైతు ఐలా గోవిందగౌడ్ తన పొలంలో నిత్యం నీళ్లు ఉబికి రావడం గమనించి, కూలీలతో బావి తొవ్వడం ప్రారంభించారు. పది అడుగుల లోతు తవ్వేసరికి శయనరూపంలో నైసర్గిక ఆకారంలో తూర్పు ముఖంగా చూస్తూ ఓ రాతి విగ్రహం బయటపడింది. దానిని తొలగించేందుకు ఓ కూలీ యత్నించగా గునపం రెండు ముక్కలైంది. అతను వెంటనే అనారోగ్యం పాలయ్యాడు. దీంతో తవ్వడం ఆపేసి శివభక్తులైన శివసత్తులను తీసుకొచ్చి చూపించారు. వారు ఎల్లమ్మతల్లి ఇక్కడ వెలసిందని, పూజలు చేస్తే అంతా మంచే జరుగుతుందని వివరించారు. అమ్మవారి విగ్రహాన్ని బావిలోనే ఉంచి పూజలు చేయడం మొదలు పెట్టారు. ఇప్పటికీ అమ్మవారి నిజస్వరూప విగ్రహం ఈ బావిలోనే ఉంది. ఏ కాలంలోనైన ఇందులోంచి నీళ్లు వస్తూనే ఉంటాయి. వీటిని భక్తులు తీర్థంగా స్వీకరిస్తారు. ఈ నీటితో స్నానం చేస్తే చర్మవ్యాధులన్నీ నయమవుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

మూడు రోజుల కార్యక్రమాలు ఇవే..

- **మొదటిరోజు** ఉదయం సాధరణ పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు కల్యాణ మహోత్సవాలు ప్రారంభమవుతాయి. ముందుగా గణపతి పూజ అంకురార్పణ తదితర పూజలు చేస్తారు. సాయంత్రం 7 గంటలకు స్థానికంగా ఉండే దేవాదాయ శాఖకు చెందిన శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర దేవాలయానికి ఊరేగింపుగా అమ్మవారిని, స్వామివారిని తీసుకెళ్తారు. అక్కడ ఆలయ నిర్వాహకులు పూజలు చేసి పట్టు వస్త్రాలు అందజేస్తారు. అనంతరం శివసత్తులు పుట్టబంగారం సమర్పిస్తారు.
- **రెండోరోజు** ఉదయం 4 గంటలకు నాదస్వర మంగళ వాయిద్యాలు, అభిషేకం, ఉదయం 8 గంటలకు స్థాపిత దేవతపూజలు, మహావిద్య చండీ మూల మంత్ర అనుష్టానాలు, వేదపారాయణం, ఉదయం 11-51 గంటలకు ఉత్తర నక్షత్రయుక్త అభిజిత్‌లగ్న సుముహూర్తాన ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం, సాయంత్రం 6 గంటలకు స్థాపితా దేవతా అనుస్థానాలు, రాత్రి 7 గంటలకు నీరాజన మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద వితరణలు ఉంటాయి.
- **మూడో రోజు** ఉదయం 5 గంటలకు నాదస్వర మంగళ వాయిద్యాలు, ఉదయం 9 గంటలకు స్థాపితాదేవతాపూజలు, అగ్నిప్రతిష్ఠ, గణపతి హోమం, స్థాపిత దేవత మూలమంత్ర హవనాలు, మహాశాంతి చండీహోమం కలశోద్వాసనం, ఉదయం 11 గంటలకు బలిహరణ, పూర్ణాహుతి, మహానివేదన (శాక్తేయంగా) మారుబోనం సాయంత్రం 6 గంటలకు అమ్మవారి రథోత్సవం పూరవీధుల్లో ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఇబ్బందులు కలుగకుండా బారీకేడ్లు

అమ్మవారిని దర్శించుకునేందు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూ లైన్ లో దర్శనం చేసుకునేందుకు ఆలయం చుట్టూ రోడ్ల భవనాల శాఖ అధికారులు విశాలమైన బారీకేడ్లను ఏర్పాటు చేశారు. ఆలయం ఉత్తరం వైపు ప్రధానరోడ్డు హోలీ క్రాస్ స్కూల్ సమీపంలో, దక్షిణం వైపు ఎస్ఎస్ బేకరీ సమీపంలో స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. ఆలయం గోపురం, బోనం కాంప్లెక్స్ ఆలయం ముందు, పక్కన అమర్చిన మెర్క్యూరీ లైట్ల వెలుగులతో ఎల్లమ్మ ఆలయం పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

వరుడిగా త్రిశూలం..



సీతారాములు, పార్వతీపరమేశ్వరులు, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఇలా దేవతల కల్యాణాలకు వధువరులుంటారు. అయితే ఇక్కడ బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం అని మాత్రమే పిలుస్తారు. ఒకప్పుడు ఎల్లమ్మను మాత్రమే పీఠలపై ఉంచి ఈ తంతు నిర్వహించేవారు. తర్వాత అమ్మవారి పక్కన త్రిశూలాన్ని వరుడిగా నిలబెడుతున్నారు. ఆలయ అర్చకులు తెలిపిన వివరాల ప్రకారం.. పరశురాముని తల్లి, జమదగ్ని భార్యే రేణుకా ఎల్లమ్మ. జమదగ్ని పరమశివుని భక్తుడు. ఈ నేపథ్యంలో త్రిశూలంగా మారి శివునితోనే ఉంటాడు. ఈక్రమంలో అమ్మవారి కల్యాణం రోజున జమదగ్ని రూపమైన త్రిశూలాన్ని వరుడిగా పెళ్లిపీటలపై నిలబెడుతారు. ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారితో పాటు నిత్యం మూలవిరాట్‌లో త్రిశూలానికి పూజలు చేస్తారు.



రోడ్డు పై ఏర్పాటు చేసిన స్వాగత తోరణం



క్యూలైన్ కోసం ఏర్పాటు చేసిన బారీకేడ్లు



పురుషోత్తమరావుకు నియామక పత్రం అందజేస్తున్న జేడీ లక్ష్మీనారాయణ, చిత్రంలో ఎంపీ రామచంద్ర, మాజీమంత్రి జోగు రామన్న

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పురుషోత్తంరావు

ఖైరతాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా సర్దార్ పుటం పురుషోత్తమరావు ఎన్నికయ్యారు. ఆదివారం పీవీ నర్సింహారావు మార్గంలోని జలవిహార్‌లో ఉత్కంఠగా జరిగిన ఎన్నికల్లో పురుషోత్తమరావు సమీప ప్రత్యర్థిపై 524 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. ప్రదాన కార్యదర్శిగా పెద్ది పెంటయ్యను కోశాధికారిగా కంచె సత్యనారాయణను ఎన్నుకున్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు ఈ ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. మున్నూరు కాపు సంఘం అపెక్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నియమించిన ఎన్నికల కమిటీ ప్రధానాధికారిగా విశ్రాంత ఐపీఎస్ అధికారి జేడీ.లక్ష్మీనారాయణ వ్యవహరించారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం ఎన్నికలు నిర్వహించారు. ఫలితాల ప్రకటన అనంతరం గెలుపొందిన పురుషోత్తంరావుతోపాటు ప్రధానకార్యదర్శి, కోశాధికారికి నియామక పత్రాలు అందజేసి, వారితో ప్రమాణస్వీకారాన్ని లక్ష్మీనారాయణ చేయించారు. సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులుగా వేణుగోపాల్‌పటేల్, డాక్టర్ జేఎస్.వెంకట్ పటేల్, చల్లా హరిశంకర్ పటేల్‌ను నియమించారు. మహిళావిభాగం అధ్యక్షురాలిగా బండి పద్మను అపెక్స్ కమిటీ నియమించింది. ఈ సందర్భంగా జరిగిన సంబురాల్లో ఎంపీ వద్దిరాజు రావిచంద్ర, మాజీమంత్రి జోగు రామన్న, మాజీఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పంజాగుట్ట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట్ మెట్రోస్టేషన్ కింద గుర్తుతెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడని ఆదివారం పోలీసులకు సమాచారం వచ్చింది. పోలీసులు పరీక్షించగా ఆ వ్యక్తి అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నారు. అతని వివరాలు తెలిస్తే 8712661275, 8712572064 నంబర్లలో సంప్రదించాలని ఎస్ఐ నరేష్ కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11కేవీ రోడ్ నెంబర్ 5, దేవరకొండ బస్తీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ మీనాక్షి, శబ్దాలయ స్టూడియో ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

- మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11కేవీ సాయిరాంనగర్, ఆర్బీఐఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ పిలీదర్గా, బేగంపేట నాలా, ఐజీపురం ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌లో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

సన్మానం



విద్యుత్ శాఖ ఫైనాన్స్ డైరెక్టర్ ఓరుగంటి శ్రీనివాసులును సన్మానిస్తున్న తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 1535 రాష్ట్ర అధ్యక్షుడు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి బండారు నగేష్, నాయకులు తదితరులు - ఎర్రగడ్డ

జూబ్లీహిల్స్‌పై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

మాగంటి గోపీనాథ్ సంతాప సభలో దాసోజ్ శ్రవణ్



గోపీనాథ్‌కు నివాళులర్పిస్తున్న ఆయన సతీమణి సునీత, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్,మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు

పంజాగుట్ట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంపై గులాబీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ సిద్ధార్థనగర్ కమ్యూనిటీహాల్‌లో స్థానిక కార్పొరేటర్ దేదీప్య అధ్యక్షతన ఆదివారం రాత్రి దివంగత నేత మాగంటి గోపీనాథ్ సంతాప సభ జరిగింది. మాగంటి కుమారుడు వాత్సల్యనాథ్, కుమార్తెలు అక్షర నాగ, దిషిరా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి, సోహైల్ భాయ్, మాగంటి సోదరుడు మాగంటి వజ్రనాథ్, తదితరులు నివాళులర్పించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులను గోపీనాథ్ చేపట్టారని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ అన్నారు. థీమ్ పార్క్‌కు, కమ్యూనిటీ హాల్ కు మాగంటి గోపీనాథ్ పేరు పెట్టాలని స్థానికులు కోరుతున్నారని, జీహెచ్ఎంసీ జనరల్ బాడీ సమావేశంలో లేవనెత్తాలని ఆయన కార్పొరేటర్‌కు సూచించారు. ఎన్టీఆర్ తరువాత కేసీఆర్‌ను మించిన నాయకుడు ఎవరూ లేరని తన భర్త దివంగత నేత, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎప్పుడూ చెప్పేవారని ఆయన సతీమణి మాగంటి సునీత గోపీనాథ్ అన్నారు. ఈ కార్యక్రమంలో దినేష్ చౌదరి, వై.రవి, వేణుగోపాల్, పవన్ ముదిరాజ్, కాలని అధ్యక్షుడు విజయ్ కుమార్, కోడె సాంబశివరావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

బేగంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): టెక్ మహీంద్ర స్మార్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు లాజిస్టిక్స్‌కు చెందిన సప్లై చైన్ మనేజ్మెంట్, వేర్‌హౌసింగ్ మేనేజ్మెంట్ కోర్సులలో ఉచితశిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అకాడమీ కో-ఆర్డినేటర్ దీప్తి తెలిపారు. 18 నుంచి 30సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతకు అందిస్తున్నామని తెలిపారు. ఇంటర్, డిప్లొమో, ఐటీఐ, ఏదైనా గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఆగస్టు మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, మరిన్ని వివరాలకు ఎర్రగడ్డ రైతు బజార్ ఎదురుగా ఉన్న సెయింట్ థెరిస్సా చర్చ్ కాంపౌండ్ ఆవరణలోని టెక్ మహేంద్ర స్మార్ట్ అకాడమీ కార్యాలయంలో సంప్రదించాలని లేదా 7337332606 నెంబరులో సంప్రదించాలన్నారు.

శ్యామలకు గోల్డ్ మెడల్



దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన మాస్టర్స్ ఓపెన్ మీట్-2025 క్రీడల పోటీల్లో డిస్కస్‌త్రోలో బంగారు పతకం సాధించిన బేగంపేట ట్రాఫిక్ ఏఎస్ఐ శ్యామల - బేగంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)

మా దేవాలయాలను అభివృద్ధి చేయండి



పురాతన దేవాలయాల వద్ద యాదవ సంఘం ప్రతినిధులు

ఖైరతాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఐమాక్స్ ఎదురుగా ఉన్న లేక్ వ్యూ పార్కులో ఉన్న యాదవుల దేవాలయాలైన గాలి పోచమ్మ, కట్ట మైసమ్మను ప్రభుత్వం, హెచ్ఎండీఏ అభివృద్ధి చేయాలని ఖైరతాబాద్ యాదవ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు పార్కులో భూమికి దాదాపు 10 అడుగుల లోతులో ఉన్న ఆలయాలను పరిశీలించారు. తమ పూర్వీకులు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ అమ్మవార్ల ఆలయాలు చిన్నపాటి వర్షం వచ్చినా నీటిలో మునిగిపోతున్నాయన్నారు. తమ స్థలాన్ని వినియోగించుకొని పార్కు నిర్మించిన హెచ్ఎండీఏ తమ దేవాలయాలను అభివృద్ధి చేయాలని సంఘం అధ్యక్షుడు కుమార్ యాదవ్, ఆలయాల కమిటీచైర్మన్ జీ.కృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ ఆలయాల్లో పూజలు నిర్వహించే యాదవులకు పార్కులోకి ఉచితప్రవేశాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు పాండుయాదవ్, భవానికృష్ణయాదవ్, మారయ్య యాదవ్, కృష్ణ యాదవ్, ఫకీరయ్య యాదవ్, రవియాదవ్, రాజేందర్‌యాదవ్, లక్ష్మణ్ యాదవ్, రాముయాదవ్, మల్లికార్జున్ యాదవ్, గంగాధర్ యాదవ్, వెంకటేష్‌యాదవ్, అంజన్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి



మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న భీమ్ సైనిక్ ఫౌండేషన్ ప్రతినిధులు

పంజాగుట్ట,జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. భీమ్ సైనిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జి.వివేక్‌వెంకటస్వామిని సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ తన తండ్రి దివంగత నేత జి.వెంకటస్వామి అడుగుజాడల్లో నడుస్తానని, ఆయన పేరు నిలబెడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కలకోట సత్యనారాయణ, ఎంఏ.సిద్దిఖీ, టీ.తిరుమల్, గోసంగి సంఘం అధ్యక్షుడు నిశాని శంకర్, సంపత్, రాములు, సత్యనారాయణ, కమలా రాణి, ఝాన్సీ, వీరమణి, తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కాంగ్రెస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇన్‌చార్జి అజారుద్దీన్

ఎర్రగడ్డ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అపార్ట్మెంట్ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇన్చార్జి మహ్మద్ అజారుద్దీన్ అన్నారు. ఆదివారం ఎర్రగడ్డలోని సిటడిల్ బ్రిగేడ్ అపార్ట్‌మెంట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రధానంగా మూసాపేట బ్రిడ్జి నుంచి అపార్ట్‌మెంట్ల మీదుగా మోతినగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డును డబల్ రోడ్డుగా నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిటడిల్ బ్రిగేడ్ అపార్ట్మెంట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి లక్ష్మీప్రసాద్, వివిధ అపార్ట్మెంట్స్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నగర ప్రధానకార్యదర్శి దూడల రవిగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ **మహ్మద్ అజీమ్ తండ్రి రహమాన్,** నివాసం ఫ్లాట్ నం.173, కళ్యాణ్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్, హైదరాబాద్ వారు దిగువ షెడ్యూల్ ఆస్తి యజమానులు అనగా 1.అనుపమ్ అగర్వాల్, 2.అనూష అగర్వాల్, 3. పాలక్ అగర్వాల్, 4. మనీషా అగర్వాల్ నుండి కొనుగోలు చేయాలనుకుంటున్నారని ఉద్దేశిస్తున్నారు.వాస్తవానికి సదరు షెడ్యూల్ ఆస్తులు శ్రీమతి సరోజ్ అగర్వాల్ అనే వ్యక్తి ఎస్ఆర్ఓ, ఎస్ఆర్ నగర్ నమోదిత సేల్ డీడ్ నం.లు.1721/2012 మరియు 1722/2012 తేది: 07.09.2012న కొనుగోలు చేశారు. శ్రీమతి సరోజ్ అగర్వాల్ 21.02.2023న మరణించారు మరియు ఆమె మరణించిన తర్వాత ఆమె భర్త మరియు పిల్లలు అనగా 1. రాజ్ కిషోర్ అగర్వాల్ 2. అనుపమ్ అగర్వాల్ 3. అనూష అగర్వాల్ 4. మనీషా అగర్వాల్ ఆమె న్యాయ వారసులుగా ఉన్నారు.వారు ఆషెడ్యూల్ ఆస్తుల యొక్క ఉమ్మడి యజమానులు మరియు స్వాధీనదారులు అయ్యారు. సదరు న్యాయ వారసులు ఆ షెడ్యూల్ ఆస్తులను విభజించి మరియు ఎస్ఆర్ఓ, హైదరాబాద్ (ఆర్ఓ) కార్యాలయంతో రిజిస్టర్ పార్టిషన్ డీడ్ నం.972/2023, తేదీ.27.03.2023న అమలుపరిచారు మరియు తదుపరి స్వర్గీయ సరోజ్ అగర్వాల్ న్యాయవారసులకు మాత్రమే కేటాయించబడినది. తదనుగుణంగా సదరు షెడ్యూల్ ఆస్తులు, స్వర్గీయ సరోజ్ అగర్వాల్ కుమారుడు అనుపమ్ అగర్వాల్ మరియు రాజేకిశోర్ అగర్వాల్‌కు కేటాయించబడినది. ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి ఏడు (7) రోజులలోపు షెడ్యూల్ ఆస్తులకు సంబంధించి అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్లతో పాటు నా క్లయింట్ లేదా నా కార్యాలయాన్ని సంప్రదించవలెను. లేనిచో పైన పేర్కొన్న వ్యవధి ముగిసిన తర్వాత ఎటువంటి క్లెయిమ్స్ లేదా ఏ విధంగాను స్వీకరించబడవు.

షెడ్యూల్ ఆస్తి

హైదరాబాద్, ఖైరతాబాద్, పద్మావతినగర్, ప్లాట్ నం.14, ఆవరణ నం.6-3-595/21లోని 278 చ.గజాలలో 45 చ.గ.లు మరియు 47 చ.గ.లకు సంబంధించిన అవిభాజ్య వాటాతో ప్రతి 907 చ.అ విస్తీర్ణం గల రాజ్ నివాస్ యొక్క మొదటి అంతస్తుపై ఫ్లాట్ నం.101 మరియు 102 గల ఆస్తి యావత్తు.

సం./- ఎస్. చంద్రశేఖర్, అడ్వకేట్
ఇ.నం.83-191/136 (188/సి), వెంగళ్‌రావు నగర్ కాలనీ, హైదరాబాద్-500038, మొబైల్ నం.9247408839

క్యాత్ ల్యాబ్‌ల్లో రేడియేషన్ ఎక్కువ

నిమ్స్‌లో కాంప్లికేషన్స్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

నిమ్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): క్యాత్ ల్యాబ్‌ల్లో రేడియేషన్ ఎక్కువగా ఉంటుందని, దాని వల్ల వైద్యులకే ఎక్కువ సమస్యలు వస్తాయని కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ సోమరాజు అన్నారు. దానిని అధిగమించడానికి తగిన పరికరాలు వాడాలని వైద్యులకు సూచించారు. గుండె శస్త్రచికిత్సకు ముందు యాంజియోగ్రఫీ చేసే సమయంలో వైద్యులు క్యాత్‌ల్యాబ్(ఆపరేషన్)థియేటర్లో ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను ఎలా అధిగమించాలనే అంశంపై కార్డియాలజీ విభాగ నిపుణులు వైద్యులకు, వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిమ్స్ ఆస్పత్రి ఐదో అంతస్తు ట్రామా ఆడిటోరియంలో 'ఇంటర్వెన్షనల్ కాంప్లికేషన్స్' మేనేజ్మెంట్ ఆఫ్ క్యాత్ ల్యాబ్ కాంప్లికేషన్స్' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ప్రముఖ కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ బి.సోమరాజు, డాక్టర్ దయాసాగర్‌రావు, డాక్టర్ శేషగిరిరావు మాట్లాడారు. వైద్యులు ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కరోనరి యాంజియోగ్రఫీ, పీటీసీఏ(గుండెకు)స్టెంట్‌ను సరైన పద్ధతిలో ఎలా అమర్చాలి అనే అంశాలపై చర్చించారు. డాక్టర్ రమాకుమారి ఆధ్వర్యంలో జరిగిన కంటున్యూ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎంఈ) ప్రోగ్రాంలో డాక్టర్ శ్రీనివాసకుమార్, డాక్టర్ అనుజ్ కపాడియా, డాక్టర్ శశికాంత్, డాక్టర్ అమర్నాథ్ పాల్గొన్నారు.

మినీ జాతరను తలపించిన ఘటోత్సవం


ఘటం అలంకరణకు అమ్మవారి ఆభరణాలను ఆలయ అనువంశిక ధర్మకర్తలకు అందచేస్తున్న తలసాని


ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి పూజలు చేస్తున్న విద్యా శంకర భారతి


విద్యా శంకర భారతికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అర్చకులు


ఉజ్జయినీ మహాకాళి ఆలయం వద్ద డ్యాన్స్ చేస్తున్న మంత్రి పొన్నం, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

కోలాహలంగా ఉజ్జయినీ మహాకాళి ఆలయ పరిసరాలు

పోటెత్తిన భక్తజనం

సికింద్రాబాద్, రాంగోపాల్‌పేట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే లష్కర్ బోనాల జాతరలో తొలి ఘట్టమైన ఘటోత్సవం(ఘటం ఎదుర్కోలు) అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. వందలాది మంది భక్తుల నడుమ, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతల సమక్షంలో అమ్మవారి ఆభరణాలను ఆలయ అనువంశిక ధర్మకర్తలకు అందచేయడం, ఘటాన్ని బుద్ధ భవన్ ఎదురుగానున్న ఇందిరానగర్ బస్తీలోని మహాకాళి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లడం, అక్కడ ఘటాన్ని అలంకరించి తిరిగి ఊరేగింపుగా ఉజ్జయినీ మహాకాళి ఆలయానికి తీసుకురావడం, దారి పొడవునా భక్తులు పూజలు చేయడం, జంటనగరాల నుంచి భక్తులు పోటెత్తడం వెరసి ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయం వద్ద మినీ బోనాల జాతరను తలపింపచేసింది. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం ఇంచార్జి కోట నీలిమ, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్, ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి, ఉత్తర మండల డీసీపీ రష్మీ పెరుమాళ్, ఏసీపీ సైదయ్య, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి మల్లిఖార్జున్‌గౌడ్, బీజేపీ నాయకులు వి.దయానంద్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.


ఆషాఢ మాసం తొలి ఆదివారం సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి దేవాలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ తదితరులు (రాంగోపాల్‌పేట్ - ఆంధ్రజ్యోతి)


ఉజ్జయినీ మహాకాళి ఆలయానికి బోనంతో వస్తున్న మహిళ






శ్రీఉజ్జయినీ మహాకాళి మాణిక్యాలమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో అమ్మవారికి తొలి బోనం, ఫలహారం బండితో వస్తున్న సమితి సభ్యులు కఠారి మహేష్ యాదవ్, రమణ రాజ్, మోహన్, ప్రశాంత్, శేఖర్, నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు దుండిగల్ల మల్లిఖార్జున్ తదితరులు


శ్రీఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి బోనం సమర్పించడానికి వచ్చిన శివశక్తులకు మహంకాళి పోలీస్‌స్టేషన్ వద్ద గుమ్మడికాయ కొట్టి స్వాగతం పలుకుతున్న మహంకాళి ఏసీపీ సైదయ్య, రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు.


తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో ఆలయ నిర్వాహకులు

అమ్మవారికి సాక సమర్పించిన తలసాని

రెజిమెంటల్‌బజార్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక అని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం మోండా డివిజన్ ఆదయ్యనగర్‌లోని 18 టెంపుల్స్‌లో ఆషాఢ బోనాల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి సాక సమర్పణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఏకాంబరం, సాయి, శేఖర్, భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ఉచితంగా నోట్ పుస్తకాలు, టిఫిన్ బాక్సులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

విద్యార్థుల చదువుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

రాంగోపాల్‌పేట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులు చదువుల్లో రాణించాలని కోరుతూ వారి చదువులకు అవసరమయ్యే సదుపాయాలు కల్పించడమే తమ ధ్యేయమని కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఆదివారం ఈస్ట్ మారేడుపల్లిలోని లోహియానగర్ బస్తీలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ సి.సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని 300 మంది చిన్నారులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, టిఫిన్ బాక్సులను అందజేశారు. అంతకుముందు సీనియర్ నాయకులు సి.సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో బస్తీలో ఏర్పాటు చేసిన మూడు సీసీ కెమెరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్ యాదవ్, ఆర్ డి నాగేష్, డి.శ్యాంసుందర్, నర్సింగ్, మహేష్, క్రాంతి కుమార్, అరుణ్ కుమార్, వెంకటమ్మ, అనురాధ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు సన్మానం

తిరుమలగిరి జూన్ 29(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తయిన సందర్భంగా షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో బొల్లారంలోని రిసాలబజార్‌లో ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఖదీరవన్, మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, మాజీ బోర్డు మెంబర్ లోక్‌నాథ్, ఉదయ్, రామన్, పీ.డీ.అశోక్, ప్రీతిరాజ్, భీమ్‌రావ్, ఉదయ్ కుమార్, కేజీ రజు, రవి, అశోక్‌కుమార్, ఉమేష్, హయత్ తదితరులు పాల్గొన్నారు.

'బోనాల జాతరను వైభవంగా నిర్వహించుకుందాం'

సికింద్రాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహిద్దామని అందరూ సహకరించాలని దక్కన్ మానవ సేవా సమితి ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మాజీ కార్పొరేటర్, దక్కన్ మానవ సేవా సమితి ప్రధాన కార్యదర్శి అత్తెల్లి మల్లిఖార్జున్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమితి సర్వసభ్య సమావేశంలో బోనాల జాతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జాతర అధ్యక్షునిగా కె.శ్యామ్‌రావును ఎన్నుకున్నారు. అనంతరం ప్రతినిధులు మాట్లాడుతూ 1926లో దక్కన్ మానవ సేవా సమితి ఏర్పడిందని, ఆలయం వద్ద జంతు బలిని ఆపి, గత 99 సంవత్సరాలుగా సాత్విక పూజ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కొంకా రఘుమోహన్, కార్యనిర్వాహక కార్యదర్శి సి.కె.నర్సింగ్‌రావు, రిసెప్షన్ కమిటీ చైర్మన్ కె.వి.కమల్‌కుమార్; ఫుడ్ కమిటీ కన్వీనర్ సీహెచ్.శ్రీనివాస్, కార్యదర్శి వజనాల దయానందరావు, రిసెప్షన్ కమిటీ వైస్ చైర్మన్ ఎన్.శ్రావణ్, ప్రచార కమిటీ కన్వీనర్ గున్నాల రవికుమార్, కోశాధికారి గోపిశెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి దేవాలయంలో కలశ పూజ

తిరుమలగిరి జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి లాల్‌బజార్‌లోని మహంకాళి దేవాలయంలో లాల్‌బజార్‌కు చెందిన టైగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5 నదుల జలాలతో అమ్మవారికి 108 కలశాలతో అభిషేకం చేశారు. ఆదివారం అర్చన, కుంకుమార్చన, పుష్పాభిషేకం పూజలు జరిగాయి. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఆర్య వైశ్య కార్పొరేషన్ కల్వ సుజాతలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. దేవాలయం అధ్యక్షుడు మురళీ ముదిరాజ్ భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.


ఆలయానికి చేరుకున్న జగన్నాథ రథయాత్ర

అంగరంగ వైభవంగా జగన్నాథ రథయాత్ర

అడ్డగుట్ట, జూన్ 29(ఆంధ్రజ్యోతి):మహేంద్రాహిల్స్‌లో ఉన్న జగన్నాథ మందిర్ గౌశాల ఆలయంలో ఆదివారం ఆధ్యాత్మిక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయం నుంచి బయలుదేరిన జగన్నాథ రథయాత్ర మహేంద్రాహిల్స్, త్రిమూర్తి కాలనీ, సత్యనారాయణ మందిర్, మారేడుపల్లి, భారత్ పెట్రోల్ పంపు మీదుగా దాదాపు ఐదు గంటలు సాగి తిరిగి ఆలయానికి చేరుకుంది.

సీపీఎం సికింద్రాబాద్ కన్వీనర్ ఎన్నిక


ఆర్ మల్లేష్

అడ్డగుట్ట, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్టలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సీపీఎం పార్టీ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్, సభ్యుడు శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సికింద్రాబాద్ జోన్ కన్వీనర్‌గా సీపీఎం సీనియర్ నాయకుడు అడ్డగుట్టకు చెందిన ఆర్.మల్లేష్‌ను నియమించారు. అదే విధంగా నూతన కన్వీనింగ్ కమిటీ సభ్యులుగా అజయ్‌బాబు, గోపాల్, మధు, ఎల్లయ్య, శారద, అంజమ్మ, ప్రభాకర్‌లను నియమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నర్సయ్య, వెంకటేష్, లలిత, వసంత, సరోజ, దీపా, లక్ష్మి, రాంచందర్, పాషా, పోచయ్య, భాగ్య, ఎల్లప్పలు పాల్గొన్నారు.


అడ్డగుట్టలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశం

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గ ఎన్నిక

అడ్డగుట్ట, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట డివిజన్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ డివిజన్ అధ్యక్షులు ఎన్నికలు నిర్వహించారు. ఎంఎస్‌పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, సికింద్రాబాద్ కో-ఇన్‌చార్జి ఎండేటి వేణుగోపాల్, సికింద్రాబాద్ ఇన్‌చార్జి నలిమెల విజయరావుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అడ్డగుట్ట డివిజన్ ఎంఎస్‌పీ నూతన డివిజన్ అధ్యక్షుడిగా మెడబాబు, ఉపాధ్యక్షుడిగా మానేపల్లి దశరథ్, అధికార ప్రతినిధి నర్సింగ్, ప్రధాన కార్యదర్శి గోనే శ్రీనివాస్‌లను ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వీవీ నర్సింహారావు, జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్, జాతీయ నాయకురాలు సుజాతలు పాల్గొన్నారు.


మహిళలతో కలిసి కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్


జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఘనంగా ఆదం జన్మదిన వేడుకలు

బౌద్ధనగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, రైల్వే కార్మిక నాయకుడు ఆదం సంతోష్‌కుమార్ జన్మదిన వేడుకలు కార్యకర్తలు, నాయకుల మధ్య శనివారం రాత్రి సీతాఫల్‌మండిలోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగాయి. ఈ వేడుకలకు మాజీమంత్రి చిన్నారెడ్డి, వి.హనుమంత్‌రావు, కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేశ్, మేయర్ గద్వాల విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలత, బాలాంజనేయస్వామి ఆలయ చైర్మన్ నాగులూరి సాయిబాబాలు ముఖ్యఅతిథులు హాజరై ఆయనకు పుష్పగుచ్ఛాలందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, మహిళలు మధ్య సంతోష్‌కుమార్ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. పేదప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆదం ఉమాదేవీ, యువనాయకుడు ఆదం సృజన్, నాయకులు జలంధర్‌రెడ్డి, అమర్‌నాథ్‌గౌడ్, షకీల్, చక్రి, బబ్లూ, కిషోర్‌యాదవ్, మహ్మద్ వహీదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

తార్నాక, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికై భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈటీ నరసింహ్మా అన్నారు. సీపీఐ సికింద్రాబాద్ నియోజకవర్గ 4వ మహా సభలను ఆదివారం లాలాపేట్‌లోని నఫీజ్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఆ పార్టీ సీనియర్ నాయకులు సోమయ్య కార్యకర్తలు, నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించి, అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రాతినిధ్యం కోసం డివిజన్ల వారీగా పార్టీని బలోపేతం చేసి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేవిధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఛాయాదేవి, స్టాలిన్, రాజశేఖర్‌రెడ్డి, కోమురెల్లి బాబు, ఉమర్‌ఖాన్, సయ్యద్ గౌస్, శ్రీహరి, యాదగిరి, గౌరీ నాగరాజ్, గడ్డం చందర్, సునీత, రాజు తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, బోర్డు సభ్యురాలు సదా కేశవ రెడ్డి

అభివృద్ధి పనులు ప్రారంభం

బోయినపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 6వ వార్డులో ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మదా, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డిలు రూ.50 లక్షల అభివృద్ధి పనులను ప్రారంభించారు. తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయ ప్రాంతంలోని చందులాల్ బౌలి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, బోర్డు సభ్యురాలు పాల్గొని ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బోర్డు సభ్యురాలు మాట్లాడుతూ స్థానిక కాలనీ వాసులు కోరినట్లు పార్కు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థానిక ఎంపీల సహకారంతో కృషి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో పార్లమెంట్ సభ్యురాలు ఈటల రాజేందర్ సహకారంతో కంటోన్మెంట్ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు బాణాల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ వార్డు అధ్యక్షుడు ప్రతీక్ జైన్, మాజీ అధ్యక్షుడు అజయ్, అభిలాష్, నరేందర్, అంజలి, సునిత, స్వరూప, అనురాద సాయి, నరేష్ జైన్, గౌతం జైన్, శ్రవణ్ కుమార్, మురేష్గన్, నర్సింగ్ రాజ్, తిరుపతి, రాజు జైన్, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న జంపన ప్రతాప్

విద్యార్థులకు అండగా నిలవాలి

బోయినపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు పది సంవత్సరాలుగా ప్రముఖ సామాజిక సంఘ సేవకులు గౌతం కటారియా కుటుంబ సభ్యులు అండగా ఉంటూ విద్యను ప్రోత్సహిస్తుండటం అభినందనీయమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. ఆదివారం న్యూ బోయినపల్లి సంజీవయ్యనగర్ వీకర్ సెక్షన్‌లో గౌతం జైన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నిరుపేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దిశా జైన్, రాజేష్ కటారియా, సుమిత్ కటారియా, శౌన్యా కటారియా, బస్తీ అధ్యక్షుడు అశోక్ కుమార్, వరద రాణి, వరప్రసాద్, శశి తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి


అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేస్తున్న కుమ్మరి ఆంజనేయులు తదితరులు

తార్నాక, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట్‌లోని పోచమ్మ దేవాలయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై దేవాదాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కుమ్మరి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం లాలాపేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయంలో 40 సంవత్సరాలుగా వంశపారంపర్యంగా మా కుటుంబ సభ్యులు సేవలందిస్తున్నామని, అయితే కొంతకాలంగా మా కుటుంబానికే చెందిన కోటేశ్వరరావు అనే వ్యక్తి నియంతృత్వంగా గుడికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను తన చేతుల్లోకి తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ విషయాన్ని దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో, ఇటీవల దేవదాయ శాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు దేవాలయంలో కోటేశ్వరరావు చేస్తున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా హైకోర్టు ఆదేశాల మేరకు గుడి కమిటీలో కోటేశ్వరరావుతో పాటు, వంశపారంపర్యంగా సేవలందిస్తున్న తమ కుటుంబ సభ్యుల పేర్లను కూడా చేర్చి న్యాయం చేయాలని కోరారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

బోయినపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లక్ష్మణ్ సింగ్ అనే వ్యక్తిని బోయినపల్లిలోని డైరీ ఫాం రోడ్ సమీపంలో విశ్వసనీయ సమాచారం మేరకు నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివశంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు బొలెరో వాహనంలో సుమారు 2 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడని, మేడ్చల్‌కు చెందిన మోసిన్ అనే వ్యక్తికి విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితుడు బోయినపల్లిలోని పలు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యం అక్రమంగా కిలో రూ.10కి కొనుగోలు చేసి మరో నిందితుడికి కిలో రూ.20కి విక్రయించి డబ్బు సంపాదించేవాడని తెలిపారు. నిందితుని నుంచి రేషన్ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. కాగా ఈ వ్యక్తి గతంలో పలుమార్లు రేషన్ బియ్యం తరలిస్తుండగా బోయినపల్లి పోలీసులు కూడా అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచడం గమనార్హం.

స్క్వాష్ విజేతలు సూరజ్, దీపిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ఓపెన్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో సూరజ్, దీపిక విజేతలుగా నిలిచారు. ఆదివారం సికింద్రాబాద్ క్లబ్ జరిగిన ఫైనల్స్‌లో సింగిల్స్‌లో సూరజ్‌చంద్ 11-3, 11-1, 11-6తో ఆర్యన్‌పై, మహిళల సింగిల్స్‌లో దీపిక 8-11, 11-6, 11-8, 9-11, 11-4తో రీవపై గెలిచారు. బాలుర అండర్-11లో నిర్వాన్, అండర్-19లో ఆయూష్, బాలికల అండర్-11లో సమీక్ష, అండర్-19లో అనన్య మాస్టర్స్ 35 విభాగంలో సందీప్, మాస్టర్స్ 40 కేటగిరీలో ముఖేష్, మాస్టర్స్ 45 విభాగంలో సౌరభ్ టైటిళ్లు దక్కించుకున్నారు.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్

అంబర్‌నగర్‌లో రక్తదాన శిబిరం

బౌద్ధనగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధి బారిన పడిన చిన్నారుల సహాయార్థం ఆదివారం బౌద్ధనగర్ గాంధీ విగ్రహం వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ సికింద్రాబాద్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల్ శ్రీనివాస్‌గుప్తాలు ముఖ్య అతిథులుగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలు, నాగమళ్ల సుధాకర్, ప్రభాకర్, కె.శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు శైలేందర్, రవీందర్‌సాగర్, మిట్టపల్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి : సింహాద్రి

తార్నాక, జూన్ 29(ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ వ్యతిరేక శక్తుల నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సోమనబోయిన సింహాద్రి అన్నారు. ఆదివారం తార్నాకలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ బేసిక్ స్ట్రక్చర్‌ను మార్చే హక్కు పార్లమెంట్‌కు లేదని 1973లో 13 మంది జడ్జిలతో కూడుకున్న సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పునిచ్చిందని అయినప్పటికీ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని మారుస్తామని పలుమార్లు ప్రకటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ రక్షణే దేశ రక్షణ అని, బలమైన రాజ్యాంగ ఉద్యమంతో ప్రజలు రెండో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ ఉపాధ్యక్షుడు డా. నిమ్మతోట వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోకటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం

ఆషాఢమాసం పురస్కరించుకుని ఆదివారం చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయంలో బీఆర్ఎస్ నాయకుడు జి.చంద్రశేఖర్ పదకొండు మంది ఆలయ హక్కుదారులకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానం చేశారు. అనంతరం కట్టమైసమ్మ, పోచమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు.
- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి